ప్రజాశక్తి

సోమవారం 10 జూన్ 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



దాడుల నుంచి కాపాడేందుకు వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ వేసిన కంచె

ప్రతీకార దాడులు



వంశీ ఇంటిపై రాళ్ల దాడి (ఫైల్‌ఫొటో)

- ఇళ్లపై రాళ్ల దాడులు, విగ్రహాలు ధ్వంసం
- ప్రేక్షక పాత్రలో పోలీసులు
- లోపించిన నిఘా
- ప్రజా సమస్యలపై దృష్టి కరువు

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్నికలు ముగిసినా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో టెన్షన్ వీడలేదు. ప్రతీకార దాడుల నడుమ ప్రజలు నలిగిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన ఈ ఐదు రోజుల్లో విజయవాడ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్న పలు ఘటనలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ చర్యల వెనుకాల నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నేతలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర పోషించాల్సి వస్తుందనే విమర్శ లేకపోలేదు. మాజీ ఎమ్మెల్యేల ఇళ్లపై రాళ్ల దాడులు, వాహనాల ధ్వంసం, బైక్‌లు, దుకాణాలు తగులబెట్టడం, వైఎస్ఆర్ విగ్రహాలు తొలగించాలని ఆందోళనలు, ఇళ్ల స్థలాల శిలాఫలకాలు ధ్వంసం చేయడం ఇలా పలు రూపాల్లో ప్రత్యర్థి వర్గంపై ప్లాన్ ప్రకారం దాడులు, ప్రతీకార చర్యలకు పూనుకుంటున్నారు.

విజయవాడలోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు బోర్డును ధ్వంసం చేయడంతో పాటు స్థానిక పాలీక్లీనిక్ రోడ్డులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే ఇంటిపై యువకులు పెద్దఎత్తున తరలివచ్చి రాళ్ల దాడికి పాల్పడ్డారు. భవానీపురం స్వాతి థియేటర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలని టిడిపి శ్రేణులు గత శుక్రవారం నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. పలుచోట్ల వైఎస్ఆర్ విగ్రహాలపై రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ ఇనుప కంచె వేసి అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పెజ్జోనిపేటలో కూడా వైఎస్ఆర్ విగ్రహం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేసి భద్రత ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సెంట్రల్ నియోజకవర్గంలోని వైసిపి నాయకులు పెద్దిరెడ్డి శివారెడ్డి ఇళ్ళు, కార్లపై గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దాడులు చేశారని బాధితులు నున్న పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తూర్పు నియోజకవర్గంలోని ఒక పార్టీకి చెందిన సోషల్ మీడియా కన్వీనర్‌కు చెందిన పల్సర్‌బైక్‌పై కొంతమంది పెట్రోల్ పోసి తగులబెట్టి పర్యారయ్యారు. అజిత్‌సింగ్‌నగర్ నున్న సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి ఒక పార్టీకి చెందిన టైలరింగ్ దుకాణాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, దానిలో ఉన్న మూడు టైలరింగ్ మిషన్లను పగలకొట్టారు. ఇదే రీతిలో వెలుగులోకి రాని ఇంకా అనేక ఘటనలు లేకపోలేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని గడిచిన ఐదేళ్ల కాలంలో దాడులు, దౌర్జనాలు చేయడమే గాక, పెద్ద ఎత్తున కేసులు బనాయించి అన్ని రకాలుగా తమను తీవ్ర ఇబ్బందులకు గత ప్రభుత్వం గురి చేసిందని, ఇప్పుడు అధికారం తమ (మిగతా 2లో)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు

బొలేరో వాహనం, ఆటో ఢీకొని ఇద్దరు మృతి చెందగా నలుగురు తీవ్ర గాయాలపాలైన ఘటన నూజివీడు మండలం గొల్లపల్లి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గాయాలపాలైన నలుగురిని స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందినవారు. నూజివీడులో అన్నప్రసన్న కార్యక్రమానికి వెళ్లి తిరిగి మచిలీపట్నానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల ఆధీనంలో గనుల శాఖ కార్యాలయం

... వార్త 2లో



విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సిఎం ప్రమాణ స్వీకారానికి పటిష్ట ఏర్పాట్లు

సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధా టవర్స్ సమీపంలో సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు రానున్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. ప్రధాన సభాస్థలి వెనుక భాగంలోని గుంతలను పూడ్చి విఐపిలు వచ్చేందుకు వీలుగా చదును చేసే పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వేదిక వద్ద, భారీకేడింగ్, బ్లాక్‌ల విభజన వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం వీక్షించేందుకు వీలుగా సభ ప్రాంగణంతో పాటు వెలుపల ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు, సాధారణ పౌరులకు వివిధ ప్రదేశాల్లో ఎంపిక చేసిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. గన్నవరం జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంక్, ఎన్టీఆర్ ప్రభుత్వ పశు వైద్య కళాశాల, కేసరపల్లి ముస్తాబాద్ రోడ్డు సమీపంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు, ఎలిట్ విస్టాస్, మేధా టవర్స్, ఇతర లేఔట్లలో ఎంపిక చేసిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాల నుండి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను నిర్మించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కార్యక్రమ ప్రత్యేక అధికారులు ప్రద్యుమ్న, బాబు.ఎ, వీర పాండ్యన్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, అదనపు డీజీపి బాగ్చి, ఐజిలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, పోలీస్ కమిషనర్ రామకృష్ణ, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, కృష్ణా, గుంటూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు గీతాంజలి శర్మ, జి.రాజకుమారి, విజయవాడ, రాజమండ్రి మునిసిపల్ కమిషనర్లు స్వప్నిల్ దినకర్, దినేష్ కుమార్, డిఐజి గోపీనాథ్ జెట్టి, విజయవాడ డిసిపి అధిరాజ్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ల

విజయలక్ష్మి జీవితం ఆదర్శనీయం

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ)

ప్రజా ఉద్యమాలకు రావూరి కనక విజయలక్ష్మి అందించిన సహకారం మరువలేనిదని పలువురు వక్తలు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత రావూరి అజయ్‌కుమార్ సతీమణి కనక విజయలక్ష్మి సంస్మరణ సభ మొవ్వ మండలంలోని చినముత్తేవి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. సభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు చేబ్రోలు బసవపూర్ణమ్మ అధ్యక్షత వహించారు. తొలుత విజయలక్ష్మి చిత్రటానికి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు, వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అజయ్, విజయలక్ష్మి దంపతులు కమ్యూనిస్టు పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు అందించిన ఆర్థిక సహాయం, సహకారం మరువలేనిదన్నారు. అజయ్‌కుమార్ దంపతులు చివరి వరకు ఆదర్శవంతంగా, సిద్ధాంతపరంగా జీవించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. పరిసర గ్రామాల్లో ప్రజల అభివృద్ధికి, కమ్యూనిస్టు పోరాటాలకు ఉపయోగపడేలా సొంత గ్రామంలో భవనం నిర్మించి పార్టీకి అంకితమిచ్చారని తెలిపారు. మూడు తరాలుగా కమ్యూనిస్టు వారసత్వాన్ని అందిపుచ్చుకొని రావూరి భవనం నేడు ప్రజాసేవలకు నిలయంగా మారిందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ అజయ్‌కుమార్ దంపతుల ఆశయాలకు అనుగుణంగా రావూరి భవనాన్ని ప్రజా సేవలకు ఉపయోగిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విజయలక్ష్మి, అజయ్‌ల సంస్మరణ సభను ఒకేరోజు నిర్వహిస్తామన్నారు. ఈ సభలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు, జిల్లా నాయకులు శీలం నారాయణరావు, మద్దుల బసవరావు, కాకి రాజశేఖర్, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరిముల్లా, విజయలక్ష్మి కుమార్తె ప్రియాంక, సోదరుడు సాయి వరప్రసాద్, రాజారావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల ఆధీనంలో గనుల శాఖ కార్యాలయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని ఎపి గనుల శాఖ కార్యాలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎపి గనుల శాఖ డైరెక్టర్, ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా జంట పదవులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డిపై శుక్రవారం రాత్రి ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయన బదిలీ అయిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని గనుల శాఖ కార్యాలయాన్ని ప్రభుత్వం తమ



అధీనంలోకి తీసుకుని సీజ్ చేసింది. ఈ క్రమంలో శనివారం కార్యాలయంలోని అన్ని విభాగాలను పోలీసులు సోదాలు చేసి పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. కీలకమైన ఫైళ్లు, హార్డ్‌డిస్క్‌లు, ఇతర సమాచారం బయటకు వెళ్లకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకునే వరకు కార్యాలయం మూసే ఉంటుందని ఉన్నతాధికారులు తెలిపారు. గనుల శాఖ ఆధ్వర్యంలో ఇష్టానుసారంగా బీచ్‌శాండ్, బెరైటీస్, ఇసుక, బొగ్గు, ఇతర ఖనిజాల వేలం, టెండర్లు, అమ్మకాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. తద్వారా వేల కోట్ల అవినీతి జరిగిందనే విమర్శలున్నాయి. వైసిపి ముఖ్యులకు వెంకటరెడ్డి భారీ లబ్ధి చేకూర్చారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వెంకటరెడ్డిపై బదిలీ వేటు వేసి కార్యాలయాన్ని సీజ్ చేసింది. మరోవైపు గనుల శాఖ డెరెక్టర్‌గా, ఎండిసి ఎమ్‌డిగా యువరాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తాడిగడపలోని ఎపిఐఐసి భవనంలోని తన కార్యాలయంలో గనుల శాఖ అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం గనుల శాఖ కార్యకలాపాలు, చేపట్టిన ప్రాజెక్టులు, కీలక అంశాలపై రెండు గంటల పాటు సమీక్షించారు.

కొల్లేరు సమస్య పరిష్కారమయ్యేనా..!

వలస బాటలో కొల్లేటి ప్రజలు
నేతలిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతున్న వైనం



ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తాం.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఉపాధి కల్పిస్తాం.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి కొల్లేరు ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాం అని నేతలు ఎన్నికల సందర్భంగా హామీలివ్వడం, ఆపై మరవడం సర్వసాధారణమైంది. కొల్లేరుకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి అక్కడి ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా చూస్తామని పదేళ్ల క్రితం భీమవరం సభలో అప్పటి ప్రధాని అభ్యర్థి మోడీ హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకొచ్చి పదేళ్లయ్యింది. మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పదేళ్లలో కొల్లేరు సమస్య పరిష్కారానికి ఎటువంటి ముందడుగూ పడలేదు. కొల్లేరు సమస్య పరిష్కారం కావాలంటే బిజెపిని గెలిపించాలని కైకలూరు సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ప్రస్తుతం కొల్లేరు ఎక్కువగా విస్తరించి ఉన్న కైకలూరు నియోజకవర్గంలో బిజెపి, ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, దెందులూరు, ఉండి నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్ఎలే ఉన్నారు. మరి ఈ ఐదేళ్లలో కొల్లేరు సమస్యను ఏ మేర పరిష్కరిస్తారో వేచిచూడాలి.

కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఇప్పటివరకూ నేతలిచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోకపోవడంతో అక్కడి ప్రజలు జీవనానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరు ప్రాంతంలో జీవనోపాధి లేక బతుకుదెరువు నిమిత్తం కొల్లేరు ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తోంది.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొల్లేరు సరస్సు మండవల్లి మండలంలో కొంతమేర విస్తరించి ఉంది. కొల్లేరుపై ఆధారపడి సుమారు 15 గ్రామాల్లో సుమారు 16 వేల మంది జీవిస్తుంటారు. రెగ్యులేటర్ లేకపోవడంతో నిరంతరం సముద్రంలోకి నీరువెళ్లిపోవడంతో వేసవిలో ఎడారిని తలపిస్తూ ఉంటుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మోడీ భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని కొల్లేరు ప్రాంత ప్రజలకు వరాల జల్లులు కురిపించారు. రెగ్యులేటర్ నిర్మిస్తామని, కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని అదనంగా కొట్టేసిన 7,500 ఎకరాలను అందించి సొసైటీలను పునరుద్ధరిస్తానని వరాల జల్లు కురిపించారు. ఆ ఎన్నికల్లో కేంద్రంలో మోడీ అధికారం చేపట్టగా కైకలూరు ఎంఎల్ఎగా కామినేని శ్రీనివాసరావు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నేటికీ పదేళ్లు గడుస్తున్నా కొల్లేరు ప్రాంతప్రజలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారని కొల్లేరువాసులు పెదవి విరుస్తున్నారు. అంతేకాకుండా ఎకో సెన్సిటివ్ జోన్‌లోకి కొల్లేరును తీసుకొచ్చి గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేయించే పరిస్థితి తీసుకొచ్చారనే విమర్శలు ఉన్నాయి. కొల్లేరును అభివృద్ధి చేస్తామని హామీలు గుర్తించి ఎకో సెన్సిటివ్ జోన్ తీసుకురావడం ఎంతవరకూ సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల నుంచి కొల్లేరుపై ఆధారపడి జీవనం సాగించే ఇక్కడ ప్రజలు ఇంకెక్కడికి వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా పలు పార్టీలు రాజకీయంగా కాకుండా కొల్లేరును, కొల్లేరు ప్రాంత ప్రజలను, గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా చర్యలు తీసుకుని వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కొల్లేటి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తక్షణం కొల్లేరులో రెగ్యులేటర్ నిర్మించాలి

ఎల్ఎస్.భాస్కరరావు, సామాజిక వేత్త

కొల్లేరు అభివృద్ధితోనే ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. అందుకోసం తక్షణం రెగ్యులేటర్‌ను నిర్మించాలి. రెగ్యులేటర్ లేకపోవడం వల్ల జనవరిలోనే కొల్లేరు ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. అందువల్ల కొల్లేటి ప్రాంత ప్రజల జీవన భృతి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హామీలు నెరవేర్చి కొల్లేరును అభివృద్ధి చేసి కొల్లేటి ప్రాంత ప్రజలను ఆదుకోవాలి. కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

కొల్లేరును ఓటు బ్యాంకుగా పరిగణించడం తగదు

తెంటు అప్పారావు,
ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు

కొల్లేటి ప్రాంత ప్రజలను ఓట్ల కోసం వినియోగించుకుని అభివృద్ధిని గాలికి వదిలేయడం సరికాదు. ఓటు బ్యాంకుగా కాకుండా అభివృద్ధి చేస్తే కొల్లేరు ప్రాంత ప్రజలతో పాటు కైకలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుంది. రాజకీయ నాయకులు ఆ విధంగా ఆలోచించి అభివృద్ధి చేయాలి.

మొదటిపేజీ తరువాయి

ప్రతీకార దాడులు

చేతుల్లోకి వచ్చిన తరువాతైనా ప్రతీకారం తీర్చుకోకుండా ఎలా ఉంటామని ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పలువురు నాయకులే పరోక్షంగా దాడులకు పురికొల్పుతూ ప్రశాంత వాతావరణానికి గండికొట్టే చర్యలకు పూనుకుంటున్నారనే విమర్శలు అటు ప్రజల నుంచి ఇటు పోలీసు వర్గాల నుంచి బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేకే తమ వారిపైనే దాడులు చేస్తున్నారని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ప్రత్యారోపణ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలొచ్చిన నాల్గో తేదీ సాయంత్రం నుంచే ప్రతీకార చర్యలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా ముగిశాయని ప్రజలతో పాటు ఎన్నికల అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఈలోపే ముందస్తు ప్లాన్ ప్రకారం ప్రతీకార దాడులు, ఘటనల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికావడమే కాకుండా చివరకు పోలీసులు సైతం నలిగిపోయే పరిస్థితి నెలకొంది. నేటికీ ప్రజలు అనేక సమస్యలతో సుడిగుండంలో నలిగిపోతున్నారు. ధరలు, నిరుద్యోగం, నీటి కాలుష్యం, రోగాలు, డ్రైనేజి సమస్య, నిధులు కొరత ఇలా అనేక సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవి కాక ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, రానున్న కాలంలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై దృష్టి సారించాల్సిన రాజకీయపక్షాలు వాటి ఊసే ఎత్తకుండా ప్రతిదాడులకు పురికొల్పుతూ పోతుంటే ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చెత్త పన్ను ఎత్తేస్తారా? ట్రూఆప్ ఛార్జీలు తీసేస్తారా?

రంగం సిద్ధమంటూ సోషల్ మీడియాలో ప్రచార జోరు!

ప్రజాశక్తి-తాడేపల్లి

గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం ఇళ్ల నుంచి సేకరించే చెత్తకు కూడా పన్ను వేసింది. ఈ విధానం ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు తెప్పించింది. ఇంటి పన్ను వసూళ్లతో పాటు లైబ్రరీ సెస్, గ్రంథాలయం పన్ను, డ్రెయినేజీ పన్నుతో పాటు అన్ని కలిపి వసూలు చేసే పద్ధతి ఎప్పటి నుంచో ఉంది. కొత్తగా చెత్త పన్ను కట్టాల్సిందేనని వైసిపి ప్రభుత్వం జిఒ తెచ్చింది. కేంద్రంతో సఖ్యత కోసం బిజెపి పట్టణ సంస్కరణల్లో భాగంగా బలవంతంగా ప్రజల నుంచి చెత్త పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. పన్ను చెల్లించని వారి ఇళ్లు, షాపులు ముందు వివిధ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి గుమ్మరించారు. ఇది ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. చెత్త పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించి ముందుకు వెళ్లింది. ఎన్నికలు జరిగే వరకు గత ప్రభుత్వం చెత్త పన్నును కొనసాగించింది.




ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపింది. దీనిపై కూడా ప్రజాగ్రహం పెల్లుబీకింది. ఎప్పుడో ఐదేళ్ల క్రితం వినియోగించిన విద్యుత్‌కు బకాయి ఉందంటూ విద్యుత్ వినియోగదారుడు ఉపయోగించిన దానికంటే రెండు నుంచి మూడు రెట్లు ఛార్జీలు అదనంగా వసూలు చేశారు. ఇంధనం సర్‌ఛార్జీ, సర్దుబాటు, డిస్కమ్ ఛార్జీలంటూ ముద్దుపేర్లు పెట్టారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికీ వినియోగదారులు ఉపయోగించిన దాని కంటే అధికంగా బిల్లులు చెల్లిస్తున్నారు.

ఇటీవల రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చింది. గత ఆరు రోజుల నుంచి వాట్సప్, సోషల్ మీడియాలో విద్యుత్ ఛార్జీల తగ్గింపు, చెత్త పన్ను ఎత్తివేయడానికి రంగం సిద్ధం అంటూ పెద్దఎత్తున ప్రచారమవుతోంది. చెత్త పన్ను, విద్యుత్ సంస్కరణలు తెచ్చిన బిజెపితో ప్రస్తుత అధికారంలోకి రాబోతున్న ప్రభుత్వం జత కట్టింది. నిజంగా వీటిని టిడిపి ప్రభుత్వం ఎత్తివేస్తుందా? అనే ప్రశ్న వస్తోంది. చెత్త పన్ను, విద్యుత్ భారాలను సిపిఎం క్షత్రస్థాయిలో వ్యతిరేకించింది. చెత్త పన్ను కట్టవద్దని ప్రజల్ని చైతన్యపరిచింది. విద్యుత్ ఛార్జీల భారం ఏ విధంగా మోపుతున్నారో ప్రజలకు తెలియజెప్పింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం, తదితర ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు నడిపింది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల ముందు చెత్త పన్ను ఎత్తివేయాలని ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపినా ప్రభుత్వం మొండిగా ప్రజల నుంచి చెత్త పన్ను, ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసింది. తాజా రాష్ట్రంలో ఏర్పడే కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 12వ తేదీన రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం గన్నవరం మండల పరిధిలోని కేసరపల్లి, ఐటీ పార్క్ వద్ద నిర్వహిస్తున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు, అధికారులు హాజరవుతున్న సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు కృష్ణాజిల్లా ఎస్‌పి అద్నామన్ నాయీం అస్మి తెలిపారు. వాహనదారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా, వారి రవాణాకు అంతరాయం ఏర్పడకుండా, పలు ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను జిల్లా పోలీసులు ఏర్పాటు చేశారని అన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు : విశాఖ పట్నం నుండి చెన్నై వైపు వెళ్లే వాహనాలను, కత్తిపూడి నుండి జాతీయ రహదారి 216 మీదుగా ఒంగోలు వైపు, విశాఖపట్నం నుండి చెన్నై వెళ్లి వచ్చే వాహనాలను కత్తిపూడి నుండి ఒంగోలు వైపు మళ్లించడం జరిగిందన్నారు. అలాగే చెన్నై నుండి విశాఖపట్నం వైపు వచ్చు వాహనాలు ఒంగోలు నుండి రేపల్లె మీదుగా వయ మచిలీపట్నం – లోసర్ బ్రిడ్జి – నరసాపురం – అమలాపురం – కాకినాడ –కత్తిపూడి మీదుగా విశాఖపట్నం వైపు మరలించడం జరిగింద్నారు. బుడంపాడు నుండి తెనాలి – పులిగడ్డ – మచిలీ పట్నం – లోసర్ బ్రిడ్జి – నర్సాపురం – కాకినాడ – కత్తిపూడి వైపు మళ్లించినట్లు తెలిపారు. అలాగే విశాఖపట్నం నుండి హైదరాబాద్ వెళ్ళే వాహనాలను గామన బ్రిడ్జి – దేవరపల్లి – జంగారెడ్డిగూడెం – అశ్వరావుపేట – ఖమ్మం మీదుగా హైదరాబాద్, భీమ డోలు – ద్వారకాతిరుమల – కామవరపుకోట –



చింతల పూడి నుండి ఖమ్మం వైపు, ఏలూరు బైపాస్ నుండి – జంగారెడ్డిగూడెం మీదుగా అశ్వరావుపేట – ఖమ్మం మీదుగా హైదరాబాద్ వైపు, . ఏలూరు బైపాస్ – చింతలపూడి నుండి సత్తుపల్లి మీదుగా. హనుమాన్ జంక్షన్ – నూజివీడు, మైలవరం – ఇబ్రహీంపట్నం – నందిగామ మీదుగా హైదరాబాద్ వైపు మళ్లింపు ఉంటుందన్నారు. అలాగే హైదరాబాద్ నుండి విశాఖపట్నం వచ్చు వాహనాలను నందిగామ – మధిర – వైరా – సత్తుపల్లి – అశ్వరావుపేట – జంగారెడ్డిగూడెం – దేవరపల్లి – గామన బ్రిడ్జి మీదుగా విశాఖపట్నం వైపు, అలాగే ఇబ్రహీంపట్నం – మైలవరం – నూజివీడు – హనుమాన్ జంక్షన్ నుండి ఏలూరు బైపాస్ మీదుగా విశాఖపట్నం వైపు, అలాగే రామవరప్పాడు – నున్న – పాముల కాలువ – వెలగలేరు – జి.కొండూరు – మైలవరం – నూజివీడు – హనుమాన్ జంక్షన్ – ఏలూరు బైపాస్ మీదుగా విశాఖ పట్నం వైపు, విజయవాడ నుండి ఎనికేపాడు మీదుగా 100 అడుగుల రోడ్డు – తాడిగడప – కంకిపాడు – పామర్రు – గుడివాడ నుండి భీమవరం వైపు మళ్లిస్తు న్నట్లు తెలిపారు. పైన తెలిపిన ట్రాఫిక్ మళ్లింపును ప్రజలందరూ దష్టిలో ఉంచుకొని ప్రయాణాలను కొనసాగించాలని కోరారు.



మృతిచెందిన యువకుడు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : లారీని వెనుకనుంచి ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన మచిలీపట్నంలో ఆదివారం చోటు చేసుకుంది. మచిలీపట్నం నుండి చల్లపల్లి వెళ్లే బైపాస్ రోడ్‌లో జరిగిన ఈ ఘటనలో మచిలీపట్నం గోసంఘం కు సమీపంలోని జరిగిన ఈ ఘటనలో ఎస్సీ కాలనీకి చెందిన బాపట్ల బంగారం (18) మృతి చెందినట్లు ఇనగుదురు పోలీసులు తెలిపారు. మచిలీపట్నం చల్లపల్లి బైపాస్ రోడ్‌లో వెళుతున్న కంటైనర్ లారీని బంగారం వెనక నుండి ఢీ కొట్టినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధి శ్రీకాకుళం జడ్పీహెచ్ స్కూలులో 8వ తరగతి చదివిన గరికె సుశీల అనే విద్యార్థిని 2023-24 విద్యా సంవత్సరానికి నేష నల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్‌టెస్ట్‌కు ఎంపికైంది. ఈ స్కాలర్షిప్‌కి ఎంపికైన విద్యార్థినికి 2024-25 విద్యా సంవత్సరం తొమ్మిదవ తరగతి నుండి వరుసగా నాలుగు సంవత్సరాలు ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనంను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది. శ్రీకాకుళం జడ్పీహెచ్ విద్యార్థిని గొప్ప ప్రతిభ కనబడటం వల్ల స్కాలర్షిప్ అందడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్ తోడేటి సుధీర్, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

మొక్కు తీర్చుకున్న నాయకులు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే తిరుపతి ఏడుకొండల స్వామి దగ్గరికి మోకాళ్ళపై మెట్లు ఎక్కి వస్తామని మొక్కుకున్నారు. ఆ మొక్కని తీర్చుకోవడానికి ఆదివారం పాప నాశనం గ్రామానికి చెందిన బోయిన మణి, కుంపటి చిట్టిబాబు, సుంకర వినయ్ కుమార్లు మోకాళ్ళపై తిరుపతి మెట్లకి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాలని స్వామి వారికి మొక్కుకున్నామని, అఖండ మెజారిటీతో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో ఈరోజు మొక్కు చెల్లించుకున్నట్టు తెలిపారు.



మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు



కళాకారులకు పింఛన్ అందజేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి

కళాకారులకు పింఛను అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : కళారంగానికి పెద్దపీఠ వేసి గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా గుడివాడ కళాకారులకు ప్రభుత్వం ద్వారా నాటకాలు చేయించి వారికి రూ.5లక్షలు అందించిన ఘనత టిడిపికే దక్కుతుందని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. అదివారం స్థానిక నీలామహాల్ రోడ్డులోని కళాకారుల సంఘం కార్యాలయంలో టిడిపి ఘన విజయం సాధించినందుకు, పేద కళాకారులకు రూ.1000 చొప్పున అందించేందుకు ముందుకు వచ్చిన ఉపాధ్యాయుడు శీరం శ్రీనివాసరావును సత్కరించే కార్యక్రమాన్ని సంఘం గౌవర అధ్యక్షుడు నెరుసు చింతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న యలవర్తి శ్రీనివాసరావు శీరం శ్రీనివాసరావును దుశ్శాలువాతో సత్కరించి, పేద కళాకారులకు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ కళాకారులు కళకళలాడితే ఆ ప్రాంతం సుభీక్షంగా ఉంటుందన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా కళాకారుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి ఆదుకోవడం జరిగిందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా 53వేల మెజార్టీతో గెలుపొందిన వెనిగండ్ల రాము సహకరంతో కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వసంతవాడ పెద దుర్గరావు, గోకరకొండ బలరామ్, టిడిపి నాయకులు కొలుసు రాజా, సంఘ అధ్యక్షుడు కొడాలి రాజా, కార్యదర్శి గాజులపల్లి కొండయ్య, ట్రెజరీ కోటేశ్వరి, గౌవర ఉపాధ్యకుడు పి.స్వామిదాసు, నాయకులు శివాజీ, బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - గుడివాడ : ఎస్‌టియు 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గౌరశంకరపురంలోని ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యుల ఆధ్వర్యంలో సంఘ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏకైక సంఘం ఎస్‌టియు సంఘం అన్నారు. సంఘం కోసం, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు కషిచేసి ప్రాణాలర్పించిన ఎందరో మహానుబావులను స్మరించుకోవడం ముదావహమన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్త, అంతర్జాతీయ ఖో ఖో రిఫరీ మడకా ప్రసాద్‌చే 78వ ఆవిర్భావ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్ ప్రసాద్, జిల్లా నాయకులు పి.వి.ఎన్.డి ప్రసాద్, కెవి సత్యనారాయణ, ఎంఎస్ఆర్ పూజేశ్వరరావు, ఐ.అరవింద్, గుడివాడ, నందివాడ, గుడివాడ రూరల్, పెదపారుపూడి, మండలాల నాయకులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసి యున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని యాత్రి కులు ఆదివారం దర్శించు కున్నారు. వివిధ ప్రాం తాల నుండి సుమారు 23 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్ళు సమ ర్పించి వారి వారి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

ఘనంగా సురేష్ మెర్లో పట్టాభిషేకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ శివారు కోటగిరిలంక ఆర్సిఎం చర్చి ఫాదర్ సురేష్ మెర్లో పట్టాభిషేక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సురేష్ మెర్లో ఫాదర్ గా నియమించబడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం చర్చి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాదర సురేష్ కేక్ కట్ చేసి విశ్వాసులందరికీ పంచిపెట్టారు. అనంతరం ఫాదర్ లూయిస్ రాజ్ ఫాదర్ జాన్ ఫాదర్ సురేష్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విశ్వాసులకు దివ్య సత్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లూయిస్ రాజ్ మాట్లాడుతూ ఫాదర్ సురేష్ 20 ఏళ్లు చేసిన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సంఘంలోని విద్యార్థు లు 200 మంది పేద విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాదర జాన్, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన సంఘ పెద్దలు కోటగిరి లంకకు చెందిన సంఘ పెద్దలు పాల్గొన్నారు.





దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఈవో కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఇఒ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



యాత్రికుల సేవలో దేవాదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవ స్థానం, ఇంద్రకీలాద్రి వేసవి సందర్భంగా దేవ స్థానంలో ప్రతిరోజూ అమ్మవారి దర్శనార్థం విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుంది. అందులో భాగంగా ఆదివారం ఆలయానికి విచ్చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారు. గతంలో కూడా పలుసార్లు యాత్రికులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు ఎస్ సత్యనారాయణ తెలిపారు.



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి - భవానీపురం : పద్మ విభూషణ్, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి దేశానికి, రాష్ట్రానికి తీరని లోటని టిడిపి 42వ డివిజన్ అధ్యక్షులు శివాజీ ముదిరాజ్ నివాళులర్పించారు. ఆదివారం 42వ డివిజన్ టిడిపి అధ్యక్షులు శివాజీ ముదిరాజ్ ఆధ్వర్యంలో రామోజీకి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శివాజీ ముదిరాజ్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ఆయన కృషి ఎంతో గొప్పదని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్ది సతీష్, టిఎన్టిసి పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు హనుమంతరావు, జిల్లా రజక సంఘ అధ్యక్షులు ముదిగొండ శివ, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి మొవ్వ విజయ, సీనియర్ నాయకులు కామా దేవరాజు, జిల్లా మైనార్టీ నాయకులు రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూబొమ్మ సెంటర్‌లో కూటమి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన ఎన్‌డిఎ కూటమి విజయం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ జిల్లా బీసీ కార్యదర్శి ఈది నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ వన్‌టౌన్ నెహ్రూబొమ్మ సెంటర్‌లో విజయోత్సవ సంబరం నిర్వహించారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) అఖండ విజయాన్ని హర్షిస్తూ కేక్ కటింగ్, బాణాసంచా, డిజె నిర్వహించి ఘనంగా సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్ హాజరై కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో ఇబ్బందులు పడ్డ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు సిఎం కావడం పట్ల సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపులో జిల్లా బిసి నాయకుల పాత్ర ఎంతో ఉందని, గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో అద్భుతంగా బీసీ నాయకులు ఈది నాగేశ్వరావు, ఇతర బీసీ నాయకులు అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ కార్యదర్శి ఈది నాగేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పశ్చిమలో యలమంచిలి ఓడిపోతారని దుష్ప్రచారం జరిగిందని, అయితే ఎంఎస్ బేగ్ కూటమి అభ్యర్థుల విజయం కోసం పోరాడి అఖండ విజయం సాధించడానికి కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బెవర సుధాకర్, జిల్లా బిసి ప్రధాన కార్యదర్శి బూర కనకారావు, సీనియర్ నాయకులు, వడిపిన రాము, ఎర్రరెడ్డి, పీతల కనకారావు, పోతిన ధర్మారావు, తెలుగు మహిళ, అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నెహ్రూ బొమ్మసెంటర్‌లో వేడుకలు చేసుకుంటున్న ఎన్‌డిఎ కూటమి నాయకులు

వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉద్యాన పార్క్ బోర్డు ధ్వంసం

ప్రజాశక్తి - భవానీపురం :

పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్‌లో గల వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఉద్యానవనం పేరుతో నిర్మించిన పార్కు బోర్డును కొందరు టిడిపి నాయకులు తొలగించారు. ఆదివారం ఆ పార్కుకు వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి అని ఉన్న బోర్డును ఆదివారం కొందరు తొలగించారు. ఈ తొలగింపులో 40వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య కుమారుడు నవీన్, మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న భవానిపురం పోలీసులు తెలిపారు.



ఉద్యాన వన పార్క్ బోర్డును తొలగిస్తున్న టిడిపి నాయకులు

రాజగోపాల్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట:

శాసనసభ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుపొందిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ని ఆయన నివాసం వద్ద ఎపిఎంపిఎ జగ్గయ్యపేట సంఘం సభ్యులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కి సంఘం తరుపున 108 నోట్ బుక్స్,100 పెన్సిళ్లను అందజేసి, యంయల్ఏ అయిన సందర్భంగా శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాత్రికేయులకు అండగా ఉంటానని, పాత్రికేయుల అన్ని సమస్యలను త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎపియంపిఎ జగ్గయ్యపేట అధ్యక్షులు కాకరపర్తి రమేష్, కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు, బుడ్డి నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మెటికల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వారికి పాత్రికేయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంపిఎ జగ్గయ్యపేట సంఘం సభ్యులు బి.రాంబాబు, బి.యశ్వంత్, టి.రాంబాబు, వై.రాకేష్, బి.సురేష్, టి.దుర్గారావు, ఎం.ఉమా, డి.హరీష్, శివరామకృష్ణ, సింగ్, వెంకట్రావు, జహంగీర్, నాగార్జున, డి.శ్రీనివాసరావు, రామకష్ణ, యల్.శ్రీనివాసరావు, ఆరుద్ర రమేష్, మర్రి ప్రభాకర్, పి వంశీ తదితరులు పాల్గొన్నారు.



బుక్స్‌తో స్వాగతం పలుకుతున్న దృశ్యం

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: కొలికపూడి

ప్రజాశక్తి - తిరువూరు :

తాను ఎవరి మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడనని, నియోజక వర్గ అభివృద్ధి ధ్యేయంతో పాటు చదువును ప్రోత్సహించి మంచిగా చదువుకునే విద్యార్థులకు ప్రో త్సాహక బహుమతులే కాకుండా అవసరమైన వారికి ఆర్థిక సహాయం కూడా అందజేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు మధిర రోడ్డు అర్‌సిఎం చర్చి ప్రాంగణంలో దళితులు ఎమ్మెల్యే దంపతులకు ఆదివారం ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలందరూ అర్ధరాత్రి వరకు నిలబడి ఓట్లు వేసిన అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో తిరువూరు నియోజకవర్గ వేరని, ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి సేవా కార్యక్రమాలు, డబ్బు ఖర్చు పెట్టడం ఆపేస్తారని కానీ కొలికపూడి అలాంటి ఎమ్మెల్యే కాదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, తెలుగుయువత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొలికపూడి శ్రీనివాస్

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పరిధిలోని 11 కెవి ఐరన్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమత్తుల్లో భాగంగా క్రింద తెలియపరచిన ప్రాంతాల్లో ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు (2 గంటలు) పాటు భవానీపురం కరెంట్ ఆఫీస్ ఎదురు పాత యం.ఐ.జి బ్లాకులు, ఎల్.ఐ.జి బ్లాకులు, ఐరన్ యార్డ్, రిలయన్స్ పక్కన పడమటవారి వీధి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



సన్మానిస్తున్న దృశ్యం

చినరాజప్ప, యనమలకు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బెజవాడ కనక దుర్గమ్మను దర్శించు కునేం దుకు ఆదివారం విచ్చేసిన సందర్భంగా మాజీ మం త్రులు నిమ్మకాయల చిన్న రాజప్ప, యనమల రామకృష్ణుడుని బుద్ధా వెంకన్న కార్యాలయానికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర వారిని పూలమాలవేసి, శాలువాలతో సత్కరించారు.

రామోజీరావుకు ఎపిఎంపిఎ నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అక్షర సూర్యుడుగా పేరు గాంచి తెలుగు రాష్ట్రాల కీర్తిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మీడియా రంగంలో రారాజు రామోజీరావు హఠాత్ మరణానికి చింతిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ మీడియా అసోసియేషన్ (ఏపియంపిఏ) జగ్గయ్యపేట కమిటీ వారు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నగా, ఎపియంపిఎ జగ్గయ్యపేట అధ్యక్షులు కాకరపర్తి రమేష్, కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు, బుడ్డి నాగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు మెటికల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బి.రాంబాబు, బి యశ్వంత్, టి.రాంబాబు, వై.రాకేష్, బి.సురేష్, టి.దుర్గారావు, ఎం.ఉమా, డి.హరీష్, శివరామకృష్ణ, సింగ్, వెంకట్రావు, జహంగీర్, నాగార్జున, డి.శ్రీనివాస రావు, రామకష్ణ, యల్.శ్రీనివాస రావు, ఆరుద్ర రమేష్, మర్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదర్శనీయుడు సీతారామయ్య

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరారవు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు మల్లం పాటి సీతారామయ్య సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీతారామయ్య సమరసిల పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడి కడవరకు ఎర్రజెండా నీడన సాగిన సీతారామయ్య ధన్యుడని పేర్కొన్నారు. తొలుత సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి వై నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. రఘు, కళ్ళం వెంకటేశ్వరావును, గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సభ కు గ్రామ పార్టీ కార్యదర్శి పులపాక రమేష్ అధ్యక్షత వహించారు.

నేడు యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం యుటిఎఫ్ మధ్యంతర కమిషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి కనకారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం కనకారావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ వి నాగేశ్వరరావు, ముఖ్య అతిథులుగా ఆ సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, కార్యదర్శి కె ఏ ఉమామహేశ్వరరావు, ఎస్పీ మనోహర్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రావు వందన సమర్పణ చేస్తారని మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. తిరిగి రెండు గంటలకు అధ్యక్షతన రెండవ సెషన్ ప్రారంభమవుతుందన్నారు. ఇందులో సంతాప తీర్మానాలు, నివేదికలు, చర్చ ఆమోదం, సభ్యత్వ నమోదు, భవిష్యత్తు కార్యాచరణ, విద్యారంగం కర్తవ్యాలు, రాష్ట్ర సంఘం నిర్దేశించిన కర్తవ్యాలు ఇతర అంశాలు చర్చించనున్నట్లు తెలిపారు. చివరిగా అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షులు కే జీవేంద్రరావు వందన సమర్పణ చేస్తారని కనకారావు

ప్రతిభచూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రతిభావంతులైన పేద విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను కొనసాగించి మంచి స్థాయికి ఎదగాలని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా సబ్ జైళ్ళ అధికారి జీ.విజయ్ దేని ఆకాంక్షించారు. ఆదివారం చల్లపల్లి సీఆర్ వికాస కేంద్రంలో ఎస్.ఆర్.వై.ఎస్.పీ జూనియర్ కళాశాల 1987-2020 పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల ప్రభుత్వ జడ్పీ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల పదవ తరగతి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మొత్తం 46 మందికి రూ.80,500లు నగదు బహుమతులు అందచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి, మొవ్వ మండలం ఆవిరిపూడి వాసి, వరంగల్ జిల్లా సబ్ జైళ్ళ అధికారి విజయ్ దేని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ గురువులు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలని కోరారు. తన జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్న వైనం వివరించి విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. మరో ముఖ్య అతిథి, కళాశాల పూర్వ విద్యార్థి, చల్లపల్లి వాసి విశ్రాంత సుబేదార్ మిలిటరీ పోలీస్ మద్దిపట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశ సేవ చేయాల్సిన ఆవశ్యకత వివరించారు. స్ఫూర్తిదాయక ప్రసంగంతో విద్యార్థులను చైతన్యపరిచారు. అనంతరం టెన్త్ టాపర్లను వారి తల్లిదండ్రులతో సహా సత్కరించి నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, అధ్యక్షులు గోవిందరాజు అశ్విన్ కుమార్, కార్యదర్శి బీడీఆర్ ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు లంకె సుభాషిణి, విస్సంశెట్టి చారుమతి (వరంగల్), అద్దేపల్లి సాయికుమారి, మోర్ల శివ, అడ్డాడ ప్రసాద్ బాబు, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, ఎండీ.ఏ.కే.జిలాని, వాసిరెడ్డి రాకేష్, వెంట్రప్రగడ కిరణ్, పలగాని వెంకటేశ్వరరావు, మాలెంపాటి శ్రీనివాసరావు, వేములపల్లి అనీల్, పడమటి నాగేంద్రం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరంలో పోస్టుల కోసం తీవ్ర పోటీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని వివిధ శాఖల్లో అధికారుల పోస్టుల కోసంఎంతో పోటీ నెలకొంది. ప్రభుత్వ శాఖల్లో ఉన్న అధికారుల్లో బదిలీల ఫీవర్ అధికమైంది. గన్నవరంలో టిడిపి ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు గెలుపొందారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చింది. దీంతో గన్నవరంలో ప్రభుత్వం నుండి ఏపని కావాలన్నా యార్లగడ్డ వెంకట్రావు చెప్పాలనే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో గన్నవరం బదిలీపై రావడానికి ప్రయత్నిస్తున్నారు. నిజం చెప్పాలంటే గతం లో గన్నవరం అంటే ఎంతో పోటీ ఉండేది. కొన్ని శాఖ లో భారీగా సొమ్ము కట్టి మరీ వచ్చే వారు. ఇక్కడకు వచ్చిన అధికారులు సంతోషంగా తిరిగి వెళ్తారనే వాదనుంది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఎంతో కీలమైన మండల తహశీల్దార్ పోస్టు భర్తీ ఎంతో సమస్యగా మారిందని తెలుస్తోంది. తహశీల్దార్ అనిల్ కుమార్ ఎన్ని కల బదిలీల్లో భాగంగా వచ్చారు. ఆయన ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. జిల్లాలోని కొంతమంది ఇక్కడికి రావడానికి ప్రయత్నిస్తున్నారు. కొత్త తహశీల్దార్ ఎవరనేది అందరిలో ఉత్కంఠ నెలకొంది. గతంలో పని చేసి గోపాలకష్ణ మళ్లీ ఇక్కడకు రావడానికి ప్రయ త్నించారని తెలిసింది. అదే విధంగా మాధురి కూడా వద్దామనిపావులు కదుపుతున్నారు. దీంతో కొత్త వారిని రప్పించడానికి యార్లగడ్డ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదే కార్యాలయంలో ఆర్ఐ పోస్టు కోసం ఎవ్వరూ రావడం లేదని తెలుస్తోంది. గన్నవరం అంటే పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లు అవుతుందని అంటున్నారు. సివిల్ సప్లయిస్ డిటీ పోస్టు కోసం ఎవ్వరూ ముందుకు రావడం లేదని సమాచారం.పోలీసు డిపార్ట్మెంట్ విష యానికొస్తే ఎన్నికల విధుల్లో వచ్చిన సిఐ ప్రసాద్ బదిలీపై వెళ్లిపోవాల్సి ఉంది. అయితే తానుఇక్కడే ఉందామని అనుకుంటే రాజకీయంగా అనుకూలించలేదని తెలుస్తోంది. టిడిపి నాయకులు తమకు నచ్చిన అధికారిని తీసుకొచ్చుకోవాలని ఆలోచన చేశారట. నలుగురు సిఐలు గన్నవరం రావడానికి విల్లింగ్ అడిగినా వద్దని చెప్పారట. ఎస్ఐ పోస్టుకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లుగా సమాచారం. మరో కీలకమైన ఎంపిడిఓ పోస్టుకు ఎవరిని తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచనలో యార్లగడ్డ ఉన్నారట. మండల పరిషత్ కార్యాలయంలో అందరూ బదిలీపై వెళ్లిపోవాల్సిందే అని చెప్పారని తెలుస్తోంది. దీంతో కార్యా లయంలోని ఉద్యోగులంతా అయోమయానికి లోనవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ బదిలీలు షురూ కావడంతో ఇద్దరు గన్నవరం వచ్చేందుకు పావులు కదిపారని తెలిసింది. ఉన్నతాధికారుల్లో గాఢ్ఫాదర్ సహకారంతో పాటు యార్లగడ్డను ప్రస న్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ పోస్టుకుఎంతో డిమాండ్ ఉంది. విజయవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈపోస్టులోకి రావడానికి ఉన్నత స్థాయిలో పైరవీలు చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారుల్లో శ్రీనివాసరావు కు గట్టిపట్టు ఉండటంతో ఏవిధంగానైనా ఈపోస్టులోకి రావడం ఖాయమని ధీమాగా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక పంచాయతీ కార్యదర్శుల్లో చాలా మంది బదిలీపై వెళ్లాల్సి వస్తుంది. మండలం మారే విధంగా అ వకాశం కల్పించాలని కొందరు యార్లగడ్డను కలిసేందుకు పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ముఖ్యం గా గన్నవర , కేసరపల్లి, ముస్తాబాద్, బుద్దవరం మేజర్ పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టుల్లోకి రావడానికి చాలా మ ది పోటీ పడుతున్నట్లుగా సమాచారం. ముస్తాబాద పంచా యతీ కార్యదర్శి బదిలీపై వెళ్లడానికి సిద్ధంగా లేరని తెలిసింది. ఎందుకంటే ఆమెకు ఇంకా సమయం ఉంది. కానీ రాజకీయంగా ఆమెను బదిలీ చేయాలని, వీరపనేనిగూడెం కార్యదర్శిని తీసకొచ్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. కేసరపల్లి, ముస్తాబాదకు విపరీతమైన పోటీ కొనసాగుతోంది. మైనర్ పంచాయతీ ల్లోనూ కార్యదర్శుల పోస్టులకు పోటీ కొనసాగుతోంది. వ్యవసాయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు బదిలీ కావాల్సి ఉంది. ఆపోస్టు ల కోసం ఇతర ప్రాంతాల నుండి పైరవీలు చేస్తున్నారు. రాజకీయ పలుకుబడి గల వ్యక్తులు దొడ్డి దారిలో తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. విజయవాడలోని యార్లగడ్డ ఇంటి వద్ద సందడి కనిపిస్తుంది.



నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి- కోడూరు : కోడూరు మండలం లోని లింగారెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గల నక్కవానిదారి గ్రామంలో గల నిరాశ్రయ వికలాంగ వద్ధురాలు నందూరి లక్ష్మికి కోడూరు మండలం జనసేన యువ నాయకుడు బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యవసర సరుకులు, కూరగాయలు, బియ్యం, కొంత నగదు అందించారు. ఈ కార్యక్రమంలో నక్కవానిదారి గ్రామం జనసేన పార్టీ నాయకులు కోట సుబ్బారావు, జన సైనికులు బడే చంద్రకాంత్, నంద్యాల సాయి, యాదల సాయికరణ్, మేడ లక్ష్మణ్, మల్లి రాధాకష్ణ, రియాజ్, తేజ, ఈశ్వర్, కోట మణికంఠ, నరసింహ శెట్టి నంది, బొమ్మసేని గోపీచంద్, బడే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు పత్రికా రంగానికే ఆదర్శనీయులను పలువురు సీనియర్ పాత్రికేయులు అన్నారు. మచిలీపట్నం మీడియా మిత్రులు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గహం నందు రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు సీనియర్ పాత్రికేయులు మీడియా రంగానికి రామోజీరావు చేసిన సేవలను శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు నందం రామారావు, మన్నె సోమేశ్వరరావు, దాసరి రాంబాబు, చందమామ బాబు, కారుమూరి రాజేంద్ర ప్రసాద్, కష్ణప్రసాద్, మట్టా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు అన్నదానం

ప్రజాశక్తి - గుడివాడ : అభయాంజనేయ స్వామి కృపా కటాక్షం గుడివాడ ప్రజలపై ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నీలామహాల్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హన్‌మాన్ జయంతి ముగిసిన సందర్భంగా బిఎస్ఎన్ఎల్ సుబ్రహ్మణం వెంకటరమణ దంపతుల వితరణతో కమిటి సభ్యులు సుంకర నాగర్జున, రత్నగిరి, పూజారి నందూరి రాంబాబుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ అన్నదానాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, గోకరంకొండ బలరామ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ చైర్మన్ యలవర్తి

రేపు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - కంచికచర్ల : ఈ నెల 11న కంచికచర్లలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. స్థానిక గొట్టుముక్కల రోడ్డులో నన్నపనేని కళ్యాణ మండపంలో జరగనున్న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ముందుగా యుటిఎఫ్ పతాకావిష్కరణ కార్యక్రమం యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.సంజీవరెడ్డి చేస్తారన్నారు. అనంతరం సీనియర్ నాయకులు శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పి.మనోహర్ కుమార్ హాజరౌతారన్నారు. ఈ సమావేశంలో నేటి విద్యా రంగ పరిస్థితులు చర్చించి భవిష్యత్ విద్యారంగ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చలు జరుగుతాయన్నారు. టీచర్స్ తరచూ తల్లి దండ్రులతో సమావేశాలు జరిపి, విద్యారంగ పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా పనిచేసేందుకు తగు సూచనలు చేస్తామన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా అన్ని స్థాయిలో శాఖల నిర్మాణం, మహాసభలు జరుటకు అవసరమైన చర్యలు గురించి ఈ సమావేశం లో చర్చిస్తామని చెప్పారు. గత సంవత్సరం నుండి నేటి వరకు జరిగిన ఉద్యమాలు సమీక్ష జరుపుతామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య కార్యదర్శి నివేదిక ను ప్రవేశ పెడతారు. ఆఫీస్ బేరర్స్, రాష్ట్ర కౌన్సిలర్స్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిలర్స్ అన్ని మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల గౌరవ అధ్యక్షులు,సహాధ్యక్షులు కోశాధికారి, మహిళా సబ్ కమిటీ సభ్యులు, సిపిఎస్ సబ్ కమిటీ సభ్యులులి అందరూ సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.హరి ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, పులి శ్రీనివాసరావు, యుటిఎఫ్ కంచికచర్ల, వీరులపాడు నాయకులు ఎం.రామారావు, కోపూరు నాగేశ్వరరావు, ఎస్.ఎస్.వి.ఎస్.ఎన్.గుప్త, ఫణి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని బొర్రగూడెంలోని లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య వార్ల దేవస్థానంలో ఈ నెల 10న హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త సిహెచ్.వెంకట సత్య వరప్రసాద్, హిందూ సేవాదళ సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించనున్నారు. లెక్కింపులో ఆసక్తిగల యాత్రికులు పాల్గొనవచ్చని కోరారు.



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మైలవరం : బస్సును ఓవర్ టేక్ చేయ బోయి ఎదురుగా వస్తున్న ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన డంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం చాట్రాయి మండలం చనుపబండకు చెందిన తానంకి దేవ కుమారి, విస్సంపల్లి కుమారి, నూజివీడుకు చెందిన పెనుమచ్చ సీతమ్మ, మరొక ఇద్దరు జి.కొండూరు మండలం చెరువు మాధవరంలో శుభకార్యం సందర్భంగా వంట నిమిత్తం కూరగాయలు పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మైలవరంలోని విజయవాడ రోడ్డు సుధాకర్ రెడ్డి హాస్పిటల్ వద్ద విసన్నపేట మండలం పుట్రేలకు చెందిన పాతనబోయిన నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై కొండపల్లి వైపు వెళ్తూ ఎదురు ఉన్న బస్సును ఓవర్టేక్ చేయబోయి ఆటోను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తానంకి దేవ కుమారి తీవ్రంగా, గాయపడ్డారు. సీతమ్మ, కుమారులకు స్వల్ప గాయాలయ్యాయి.క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తానంకి దేవ కుమారుని 108 వాహనంలో విజయవాడ తరలించారు.



తిరుపతమ్మను దర్శించుకున్న ప్రముఖులు




ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం కృష్ణ జిల్లా పెడన నూతన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, ఉమ్మడి జిల్లా జడ్జి సారిక అరుణ, జగ్గయ్యపేట సివిల్ జడ్జి శ్రావణి శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. విజయవాడ మాచవరం డౌన్‌కు చెందిన మల్లెల రిషేక్ సాయి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందించారు.

శ్రీరామ్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రతి కార్యకర్తకు టిడిపి అండగా ఉంటుందని స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని మంగొల్లు గ్రామంలో శ్రీరాం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీరామ్‌ను నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మంగొల్లు గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల టిడిపి అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మంగొల్లు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న దృశ్యం

సూర్యప్రకాశరావుకు నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు టిడిపి నాయకులు నడకుదుటి విఘ్నేశ్వరరావు తండ్రి నడకుదుటి సూర్యప్రకాశరావు సంస్మరణ కార్యక్రమానికి మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపికి ఓటు వేయలేదని దాడి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం కొతమాత్మకూరు గ్రామంలో వైసీపీకి ఓటు వేయలేదని ఆక్రోశంతో భవన నిర్మాణం కార్మికుడు, కుటుంబ సభ్యులపై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం కొతమాత్మకూరు గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తున్న షేక్ చిన లాల్ షా, భార్య నసీమా, కుమారుడు నాగుల్ మీరాలను, అదే గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని,షేక్ లాల్‌లపై దాడి చేశారు. లాల్‌షాకు బలమైన దెబ్బలు తగలడంతో నందిగామ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను సిపిఎం నందిగామ నాయకులు సయ్యద్ ఖాసింలు పరామర్శించారు. దాడి చేసిన నిందితులను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




నందిగామ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు ఖాసిం

వైసిపిని వీడనున్న కంచికచర్ల సర్పంచ్ దంపతులు ?

త్వరలో టిడిపిలోకి ?

ప్రజాశక్తి - కంచికచర్ల : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నందిగామలో ఘోర పరాజయం వైసిపికి, రానున్న రోజుల్లో భారీ షాక్ తగిలే అవకాశం ఉందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బీజెపి కూటమి విజయదుందుభి మోగించిన విషయం తెలిసిందే. నందిగామలో కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి తంగిరాల సౌమ్య భారీ మెజార్టీతో గెలిచారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇంకా కొలువు తీరకముందే వైసిపి మద్దతుతో గెలిచిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు ఆ పార్టీని వీడి టిడిపిలోకి రావటానికి పావులు కదుపుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ముందుగా నందిగామ నియోజకవర్గంలో వలసల పర్వం కాబోతోంది. జిల్లాలోనే మేజర్ పంచాయతీ అయిన కంచికచర్ల గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, ఆమె భర్త మాజీ ఎంపిటిసి వేల్పుల శ్రీనివాసరావు వైసిపిని వీడి టిడిపిలోకి రావటానికి సిద్ధమైనట్లు సమాచారం. మూడేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసిపి మద్దతుతో వేల్పుల సునీత 3200 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. అయితే సర్పంచ్‌గా ఎన్నికైన కొద్దిరోజుల తర్వాత వేల్పుల సునీత, శ్రీనివాస్ దంపతులకు నియోజకవర్గ అధినాయకులతో పాలనాపరమైన విషయంలో బేధాభిప్రాయం తలెత్తింది. ఒక దశలో కంచికచర్ల పంచాయితీ పాలనలో నియోజకవర్గ అధినాయకుల జోక్యం పెరిగిందనే నానుడి ఉంది. తమకు తెలియకుండా అభివృద్ధి పనులు ఎజెండాలో చేర్చవద్దని, బిల్లులు డ్రా చేసేటప్పుడు తమకు తెలియపర్చాలని అధినాయకత్వం పెత్తనం చెలాయించినట్లు సర్పంచ్ సునీత పలువురి వద్ద వాపోయింది. దీంతో కొంత కాలంగా సర్పంచ్ సునీత దంపతులు వైసిపి నియోజకవర్గ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సర్పంచ్ భర్త శ్రీనివాస్ వైసిపి తరుపున ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయి, కూటమి అధికారంలోకి రావటంతో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ సునీత, ఆమె భర్త శ్రీనివాసరావు టిడిపిలోకి రావటానికి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. టిడిపికి చెందిన నాయకులతో వేల్పుల శ్రీనివాసరావు చర్చలు జరపగా, టిడిపి అధినాయకత్వం కూడా సర్పంచ్ రాకకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఎవరెవరు వస్తారానేదానిపై కూడా సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీత దంపతులకు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సమక్షంలో టిడిపి లోకి చేరతారని సర్పంచ్ మద్దతుదారులు అంటున్నారు.





కేక్ కట్ చేస్తున్న వసంత

వెల్వడంలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - మైలవరం : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా మైలవరం మండలంలోని వెల్వడంలో ఆదివారం విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎపి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు కూటమికి విజయాన్ని కట్టపెట్టారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జనరంజకంగా పరిపాలన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా... రైతు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : ట్రాక్టర్ బోల్తా పడి కౌలు రైతు మృతి చెందిన సంఘటన తిరువూరు మండలం, ముష్టికుంట్ల సమీపంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కొమ్మిరెడ్డిపల్లి శివారు గొల్లగూడెం గ్రామానికి చెందిన బట్టు శ్రీనివాసరావు (37) కౌలు తీస్తుకున్న పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్ని ఇంటికి వెళుతుండగా ముష్టికుంట్ల సమీపంలోని ఎన్ ఎస్పీ కాలులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడక్కడికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకునే గ్రామస్తులు జెసిబి సహాయంతో ట్రాక్టర్‌ను, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



ముఖం చాటేసిన వర్షం

ఖరీఫ్‌కు కష్టకాలం



దుక్కి ఖాళీగా ఉన్న పొలాలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో సాగుకు అవసరమైన వర్షం లేదు. ఖరీఫ్‌కు సాగుదార్లు అయోమయంలో ఉన్నారు. రుతుపవనాలు వెనక్కిపోవడంతో సరైన వర్షాలు లేక వరి నార్లు పోయలేదు. బోర్ల కింద నారు బాగానే ఉన్నా సాగుకు నీరు లేకుంటే ఉపయోగం ఉండదని అంటున్నారు. మెట్ట గ్రామాల్లోని 60 సాగు నీటి చెరువులు చుక్కనీరు లేక ఖాళీగా ఉన్నాయి. పోలవరం నుండి మోటార్లతో నీటిని మళ్లిస్తారని ఎదురు చూస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరా సమస్యగా మారింది. విద్యుత్ శాఖకు డబ్బులు కడితేనే కనెక్షన్లు ఇచ్చే పరిస్థితి ఉంది. ప్రభుత్వం మోటార్లకు విద్యుత్ సరఫరా చేయడం లేదు. మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఏలూరు కాలువ కింద ఉన్న ఏడు గ్రామాల్లో ఏడు వేల ఎకరాల్లో వరి వేస్తారు. కాలు వకు నీరు విడుదల చేశారు. నీరు పంట కాలువలకు ఎక్కాలంటే మరింత పెంచాలి. కానీ తక్కువగా నీరు విడుదల చేయడంతో రైతులు సాగుకు ఆలోచిస్తున్నారు. ఇంకో పది రోజుల తర్వాత పనులు ఆరంభం అ వుతాయని చెప్పారు. ఇక మెట్ట గ్రామాల్లో చెరువులకు నీరు రాకుంటే సాగులేనట్లే అంటున్నారు. వర్షాలు బాగా పడి చెరువులతో పాటు కుంటలు, పొలాల్లో నీరు వస్తే రైతులు పనుల్లోకి దిగుతారు. లేకుంటే మెట్ట పైర్లు వేయడం తప్ప మరోకటి ఉండదు. ముస్తాబాద, సూరంపల్లి, గొల్లనపల్లి, చిక్కవరం, తెంపల్లి గ్రామా ల్లో చెరువులకు పోలవరం నీరొస్తే నాట్లు పడతాయని సాగుదార్లు చెప్పారు. నారు మడులు ఎండిపోతుండటంతో వాటిని కాపాడుకునేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నారు. విత్తనాలకొరతను ఎదుర్కొంటున్నారు ప్రభుత్వం పట్టిసీమకు నీరొదిలింది. కష్టాకు నీరు చేరడంతో కిందకు వదులుతుంది. రైతులు సాగు చేసు కోవాలని చెబుతోంది. అయితే వర్షాలు పడకుండా సాగు చేసినా ఉపయోగం ఉండదని చెబుతున్నారు.

నీరు లేకుండా సాగు కష్టమే.. తిరుపతయ్య

నీరు లేకుండా వరి సాగు కష్టమే. కాలువకు నీరు వదిలినా పంట కాలువకు ఎక్కడం లేదు. మోటార్లతో ఎట్టాలంటే ఖర్చు అధికమవు తోంది. ఆయిల్ ఖర్చు పెరగడంతో ఇంజన్ల ఖర్చు పెరిగింది. ఎకరాకు రెండో వేలు దాకా నీటి ఖర్చు అవుతుంది. వర్షాలు పడితేనే రైతుసాగు చేయడానికి వీలుంటుంది.

ఈసారి రైతులకు ఆదిలోనే ఇబ్బందులు: పిచ్చియ్య

ఈసారి ఆదిలోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. విత్త నాల కొరతతో అవస్థలు పడ్డాం. సాగు నీటి కొరత వెంటాడుతోంది. కాలువకు పూర్తి స్థాయిలో నీరు రాలేదు. చెరువుల్లో నీరు లేదు. సాగుఏవిధంగా జరుగుతుందో తెలియడం లేదు. ఏలూరు కాలువకు పూర్తి స్థాయిలో నీరు వదిలితే కొంత ఉపయోగం ఉంటుంది.

చెరువులన్నీ పోలవరం నీటితో నింపాలి : ఏసుదాసు

వర్షాలు పడని కారణంగా మెట్ట గ్రామాల్లోని చెరువులన్నీ పోలవరం నీటితో నింపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మోటార్లకు వి ద్యుత్ సరఫరా ఇవ్వాలి. అందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలి. చెరు వుల్లోకి నీరు రాకుండా సాగు జరగదు. ఇప్పటికే నెల రోజులు ఆలస్యమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దుర్గమ్మ ఆదాయం రూ. 51 లక్షలు

ప్రజాశక్తి, వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో 9వ తేదీ ఆదివారం ఒక్కరోజే రూ. 51 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు ఆదివారం తెలిపారు. యాత్రికుల, భక్తుల అనూహ్యంగా పెరగటంతో ఆదివారం రాత్రి 8.30 గంటల వరకు వివిధ టికెట్ల ద్వారా మొత్తం రూ. 51,03,032 లు ఆదాయం సమకూరిందన్నారు. దర్శనం టికెట్ల ద్వారా - రూ.28,52,600లు, రూ. 500 టికెట్ల ద్వారా రూ. 13,37,000 లు, రూ. 300 టికెట్ల విక్రయం ద్వారా రూ. 6,03,900 లు, రూ. 100 టికెట్ల అమ్మకం ద్వారా రూ. 8,93,800లు ఆదాయం సమకూరిందన్నారు. అలాగే కేశ ఖండన టికెట్ల ద్వారా రూ, 4601, రూ. 68,487 లడ్డు ప్రసాదం (రూ. 15), రూ. 33,845, పులిహోర (రూ.10) టికెట్లు అమ్మకం జరిగాయి. విరాళాల ద్వారా రూ.3,02,757లు సమకూరినట్లు ఇఓ తెలిపారు.



కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అప్పికట్ల కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి విస్సన్నపేట : విస్సన్నపేటలోని కుమార్ కోచింగ్ సెంటర్ అధినేత అప్పికట్ల కుమార్‌ను ఎన్నారై గిరి ఆదివారం ఘనంగా సన్మానించారు. తిరువూరు నియోజక వర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విజయానికి అహర్నిశలు శ్రమించినం దుకుగాను కుమార్‌ను సన్మానించారు. నియోజకవర్గంలోని ఓటర్ల నాడిని ఎప్పటికప్పుడు గ్రహిస్తూ వాస్తవాలను ప్రజలలోకి తీసుకెళ్లి విజయానికి కృషి చేయడం అభినందించదగ్గ విషయమని గిరి అన్నారు.

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-పెదపారుపూడి : చెరుకూరి రామోజీరావు చేసిన సేవలు చిరస్మరణీయమని టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్(చౌదరి) అన్నారు. ఆదివారం వెంట్రుప్రగడ గ్రామంలో టిడిపి కార్యాలయంలో చలసాని రమేష్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం రమేష్ చౌదరి మాట్లాడుతూ రామోజీరావు అంతర్జాతీయ స్థాయిలో రామోజీ ఫిలిం సిటీ నిర్మించి తెలుగువారి సత్తాను ప్రపంచానికి సాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ న్యాయవాది గురుపర్తి రవికుమార్, మాయలా విజయ్ బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు



ప్రొఫెసర్లు, అతిథులతో పూర్వ విద్యార్థులు

వర్సిటీ పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 1993-95 బ్యాచ్ రాజీనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి రాజనీతి శాఖాధిపతి అంజిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై సమాజంలో రాజకీయ శాస్త్ర విద్యార్థుల బాధ్యతను గుర్తు చేశారు. ప్రత్యేక అతిథిగా నెల్లూరు డిప్యూటీ విజిలెన్స్ కలెక్టర్ పద్మాదేవి, ప్రత్యేక ఆహ్వానితునిగా విశ్రాంతి ఆచార్యులు ప్రొఫెసర్ సి.హెచ్.నారాయణరావు, ప్రొఫెసర్ భవాని ప్రొఫెసర్ ఆర్.ఆర్.లక్ష్మీకాంత హాజరయ్యారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒక్కసారిగా భావోద్రేకాలకు లోనయ్యారు. తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకోవడంతోపాటు ప్రస్తుతం ఒకరి కుటుంబ పరిస్థితిలను ఒకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వై.శివనాగరాజు, పి.శ్రీధర్, నరసింహారావు, జోసఫ్ కుమార్, సుబ్బారావు, మల్లేశ్వర వర ప్రసాదు, శివనాగేశ్వరావు, డాక్టర్ పి.నాగయ్య పాల్గొన్నారు.

కేసరపల్లిలో భద్రతా ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీజి ఐజి నవనీత్ కుమార్ మెహతా

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గన్నవరం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీజి ఐజి నవనీత్ కుమార్ మెహతా అధికారులకు సూచిం చారు. ఆదివారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఐటీ పార్కు మేధా టవర్స్ సమీపంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయుచున్న నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లపై ముందస్తు భద్రత సమన్వయం (ఏ ఎస్ ఎల్) నిర్వహించారు. తొలుత ఎస్ పి జి ఐ జి నవనీత్ కుమార్ మెహతా ఏఐజిలు శివకుమార్ ఝా, చేతన్ శర్మ, కార్యక్రమం రాష్ట్ర సమన్వయకర్త పిఎస్ ప్రద్యుమ్న నేతృత్వంలో గన్నవరం మండలం కేసరపల్లి ఐటి పార్క్ మేధా టవర్స్ సమీపంలోని సభాస్థలి ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ ఎలా రావాలి ఎలా వెళ్లాలి అని రూట్ మ్యాప్ ద్వారా చర్చించుకుని ఆ మార్గంలో వేదికనుండి గన్నవరం విమానాశ్రయం వరకు ట్రయల్ రన్ కాన్వాయిని నడిపించారు. అనంతరం విమానాశ్రయంలో ఐజి అశోక్ కుమార్, కార్యక్రమం ప్రత్యేక అధికారులు వీర పాండ్యన్. హరి కిరణ్, ఐ జి అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీమ్ అస్మి లతో కలిసి నవనీత కుమార్ మెహతా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టిగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రజలకు కూడా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సభా ప్రాంగణంలో తొక్కిసలాట జరగకుండా ఏర్పాటు పక్కాగా చేయాలన్నారు. ప్రధానమంత్రితో పాటు ప్రజల కోసం వైద్య శిబిరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏ ఎస్ ఎల్ లో ఐ ఎస్ డబ్ల్యూ ఎస్ పి శ్రీదేవి, సంయుక్త కలెక్టర్ గీతాంజలిశర్మ, ఐ ఎస్ డబ్ల్యూ అదనపు ఎస్ పి రమణ, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతా బాయి, డిటి సి పురేందర్, పంచాయతీరాజ్ ఎస్ ఈ. విజయశ్రీ, డిఎస్‌ఓ పార్వతి, పౌరసరఫరాల డిఎం సతీష్, ఎక్సైజ్ సూపరిన్టెండెంట్ ఆవులయ్య, ఫుడ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో ప్రతిభ



జగన్నాథరావు



బోతమొళ్ళ చరణ్

ప్రజాశక్తి - గుడివాడ : ఐఐటి జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో గుడివాడ విశ్వభారతి పూర్వ విద్యార్థికి ఆలిండియాలో 1వ ర్యాంక్ సాధించినట్లు విశ్వభారతి ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విడుదలైన ఐఐటి జెఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో తమ పాఠశాల పూర్వ విద్యార్థి జగన్నాథన్‌మోహిత్ ఆలిండియా 1వ ర్యాంక్, బోతమొళ్ళ చరణ్ ఆలిండియా 2వ ర్యాంక్‌తో సంచలన విజయం సాధించినట్లు తెలిపారు. దొరిశాల శ్రీనివసరెడ్డి ఆలిండియా స్థాయిలో 13వ ర్యాంక్, ఎం.సాయిదివ్య తేజరెడ్డి 15వ ర్యాంక్, ఎం.సాయిశివలోచన 16వ ర్యాంక్, కె.ప్రభాకర్‌రెడ్డి 18వ ర్యాంక్, వై.సత్యసాయినీలేష్ 20వ ర్యాంక్, కె.జాహ్నవి 78వ ర్యాంక్, డి.ఉపేంద్ర 91వ ర్యాంక్, కె.సూర్యశశాంక్ 94వ ర్యాంక్ వివిధ కేటగిరిలలో సాధించినట్లు తెలిపారు. అద్భుత విజయాలను సాధించే దుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే ఐఐటి జెయి అడ్వాన్స్‌డ్‌లో వానపాముల విశ్వభారతి వైజ్‌వుడ్స్ విద్యార్థి కె.దూండి ఈశ్వర్‌సాయి ఆలిండియాలో 2వ ర్యాంక్ సాధించినట్లు పొట్లూరి శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వెంకటేశ్వర రావు సంతాప సభ



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణానికి చెందిన ప్రైవేటు స్కూల్ టీచర్ కోరట్ల వెంకటేశ్వర రావు సంస్మరణ సభ నందిగామ భారత్ టాకీస్ సెంటర్‌లో 10వ తేదీ సోమవారం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మాజీనాయకులు కోరట్ల లక్ష్మీ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరట్ల వెంకటేశ్వర రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సిపిఎం నాయకులు చనుమ్మెలు సైదులు, కటారపు గోపాల్, షేక్ ఖాసిం, ఆకుల వెంకట నారాయణ, కర్రి వెంకటేశ్వర రావులు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



నందిగామ ఎంఎల్ఎ కు శుభాకాంక్షలు తెలుపుతున్న దశ్యం

సౌమ్యకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - నందిగామ :

శాసనసభ్యులుగా ఎన్నికైన తంగిరాల సౌమ్యకు పలువురు టిడిపి శ్రేణులు, అధికారులు, నియోజక వర్గ ప్రజలు మర్యాద పూర్వ కంగా సౌమ్యను కలిసి అభినం దనలు తెలి పారు. శుభాకాం క్షలు తెలియ డానికి వచ్చిన అందరికీ సౌమ్య ఆప్యా యంగా పలకరించారు. ఈ కార్య క్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయ కులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి- నందిగామ :

నందిగామ న్యూ సబ్ కోర్ట్ భవనాల పరిశీలనకు ఆదివారం వచ్చిన ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక మర్యాదపూర్వకంగా కలిసిన నందిగామ బార్ అసోసియేషన్ సీనియర్ జూనియర్ న్యాయవాదులు శాలువా పుష్పగుచ్చంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు అయిన నంద్రు బాబు విద్యాసాగర్, అద్దంకి మణిబాబు, ఎపిపి ఈశ్వర ప్రగడ రంగారావు, ఎజిపి దర్శి అర్జున్, ఉపాధ్యక్షులు కె.కృష్ణంరాజు, సీనియర్ న్యాయవాదులు మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకృష్ణ, షేక్ కరీముల్లా, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ న్యాయవాదుల సెల్ అధ్యక్షులు సిహెచ్.రామారావు షేక్ సైదా.తుర్లపాటి శర్మ,కొనకంచి శ్రీనివాసరావు, పాల్ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. అసోసియేషన్ తరపున 16వ అదనపు జిల్లా కోర్టును పిడిఎం కోర్టుకు మార్చాలని, పిడిఎం కోర్టుని ఏడియం కోర్టుకు మార్చాలని, ఓల్డ్ సబ్ కోర్టును సీనియర్ అడ్వకేట్‌కి బార్ రూమ్‌గా కేటాయించాలని కోరారు. 16వ అదనపు జిల్లా కోర్టు కొత్త బిల్డింగులు నిర్మించాలని కోరుతూ న్యాయవాదులందరూ కలిసి వినతిపత్రం సమర్పించారు.



జిల్లా జడ్జి అరుణ సారికను కలిసిన న్యాయవాదులు

జెఇఇలో ఫిట్జీకి ర్యాంక్




ఫిట్జీ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

శారద విద్యా సంస్థలకు జాతీయ స్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి. - ఎడ్యుకేషన్ : ఆలిండియా ఓపెన్ కేటగిరీలో జేఈఈ అడ్వాన్స్డ 2024 ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మొదటి ర్యాంక్ వరించింది. ఈ సందర్భంగా పిట్జీ క్యాంపస్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ పిన్నెపు రమేష్ బాబు వివరాలను వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థి కోడూరు తేజేశ్వర్ జేఈఈ ఫలితాల్లో ఆలిండియా 8వ ర్యాంక్ సాధించడం గర్వకారణం అని కొనియాడారు. ఈ ఫలితాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు మొదటి ర్యాంకు రావడం శుభపరిణామని సంతోషం వ్యక్తం చేశారు.దాదాపుగా 300మందికి పైగా విద్యార్థులు ఈ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించి ఐఐటీలో ప్రవేశం పొందారని తెలియజేశారు.ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా తమ విద్యార్థులు 100శాతం విజయం సాధించారని తెలిపారు. భవిష్యత్తు తరాలు విద్యార్థులకు ఈ విజయాలు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పాటు ప్రత్యేకమైన దష్టి ఉత్తమశిక్షణ విద్యార్థులకు అందించి ప్రపంచ స్థాయిలో రాణించేందుకు కషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు , అధ్యాపక బందానికి, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థి తేజేశ్వర్ మాట్లాడుతూ తమది సామాన్యమైన కుటుంబమని తమ కళాశాల కృషితో ఆలిండియా 8వ ర్యాంకు సాధించడం నాకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రత్యేకమైన విద్యాబోధన విధానంతో పాటు శారీరక మానసిక, శారీరకంగాను చైతన్య పరుస్తూ విద్యను దించడంతో ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బాణసంచా కాలుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకులు

జెఇఇ అడ్వాన్స్ 2024 ప్రవేశ పరీక్షా ఫలితాలలో మొగల్‌రాజపురంలోని శారద విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై. రమేష్‌బాబు తెలిపారు. మొగల్‌రాజ పురంలోని శారద విద్యా సంస్థల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శారద విద్యా సంస్థలకు చెందిన సీనియర్ ఎంపిసి విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలలో ఎ.సంపత్ 729వ ర్యాంకు, కె.నాగరాహుల్ ధృవ 3670వ ర్యాంకు, ఎం.నాగలక్ష్మీ లలితాదేవి 5366వ ర్యాంకు సాధించారని తెలిపారు. మరో విద్యార్థిని పి.పవిత్ర 5544, పి.వెంకట ఫణికుమార్ 7689వ ర్యాంకు సాధించి సత్తా చటారని తెలిపారు. తమ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 ప్రవేశ పరీక్షలో అత్యధిక సీట్లు సాధించే ర్యాంకులు సాధించారని, ఇంత మంచి ఫలితాలను సాధించడం తమకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ర్యాంకులు సాధించడానికి చక్కని ప్రణాళిక, అధ్యాపకులు సలహాలు, సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని అన్నారు. శారద విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 ప్రవేశ పరీక్షా ఫలితాలలో మంచి ర్యాంకులు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తమ విద్యా సంస్థలో చదివే ప్రతి విద్యార్థి కూడా అన్ని జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారని అన్నారు. పరిమితమైన విద్యార్థులతో ఇంత మంచి రిజల్ట్స్ సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అడ్వైజర్ ఈయస్ఆర్‌కె ప్రసాద్, జనరల్ మేనేజర్ జి.వి.రావు అభినందించారు.



సంపత్



లలిత



పవిత్ర



ఫణి కుమార్



రాహుల్

శ్రీ చైతన్య విజయకేతనం

జెఇఇ అడ్వాన్స్ 2024 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విజయవాడ విద్యార్థులు ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో జాతీయ స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజిఎం మద్దినేని మురళీకృష్ణ అన్నారు. ఎం.జి.రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ క్యాటగిరిలో పదిలోపు 4, 5, 6, 9, 10 ర్యాంకులు సాధించారని తెలిపారు. శ్రీ చైతన్య విజయవాడ విభాగం నుండి ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 100వ ర్యాంకులోపు నలుగురు విద్యార్థులు ఎన్.సిద్దార్థ రెడ్డి 34వ ర్యాంకు, ఎస్.జ్యోతిరాదిత్య 55వ ర్యాంకు సాధించారన్నారు. పి.వి.ఎస్.సాయి మోహిత్ 71వ ర్యాంకు, టి.వి.ఎస్.ఎస్.నాగ భూషన్ 100వ ర్యాంకు సాధించారన్నారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 500లోపు 27 మంది, ఆలిండియా క్యాటగిరి 1000లోపు 46 మంది విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారన్నారు. ఇటువంటి విజయాల శ్రీ చైతన్య విద్యా సంస్థలకు తప్ప ఎవరికీ రాలేదన్నారు. ఈ విజయానికి కారణం శ్రీ చైతన్యలోని సూపర్ -120, సి-ఐపిఎల్, అండ్ ఐపిల్ ఐసి ప్రోగ్రామ్ వల్లనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.



జ్యోతిరాదిత్య



సాయి మోహిత్



సిద్ధార్థ రెడ్డి



వెంకట శివ సాయి

ఆగని దాడులు... ఆస్తులు ధ్వంసం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఓట్ల లెక్కింపు రోజు నుంచి జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై టిడిపి మూకలు ఉద్దేశ పూర్వకంగా విధ్వంసం సృష్టిస్తున్నారని వైసిపి నాయకుల ఆరోపిస్తున్నారు. శనివారం రాత్రి పట్టణానికి చెందిన కొందరు టిడిపి కార్యకర్తలు తొర్రగుంటపాలెంకు వైసిపి కార్యకర్త పాటి సాంబ ఇంటిలోకి చొరబడి ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. అంతేకాకుండా చంపుతాను అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు సాంబ తెలిపాడు. సాంబ మాట్లాడుతూ శనివారం రాత్రి టిడిపి కార్యకర్తలైన తోట నరసింహారావు, ముత్యాల గోపి, తోట నాగరాజు, పాశం శ్రీరామ్, పాశం అశోక్, నాగేశ్వరరావు అనే వ్యక్తులు తనకు ఫోన్ చేసి 'నిన్ను చంపేస్తా' అంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి 2 గంటల సమయాల్లో తన ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులు ఎసి, వాషింగ్ మిషన్, ఎల్ఇడి టివి, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు నగదు, బంగారాన్ని దోచుకొని వెళ్లారని చెప్పారు. పై వ్యక్తుల వల్ల తనకు ప్రాణహాని ఉందని పాటి సాంబ ఆందోళన వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై పట్టణ వైసిపి నాయకులతో కలసి సిఐ కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సిఐ జానకిరామ్‌ని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హాఫీజ్ జున్నిసా ఫిరోజ్ ఖాన్, ఉన్నారు.



దాడిలో ధ్వంసమైన వాషింగ్ మిషన్

టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ మండలం కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ , జనసేనపార్టీ ఆధ్వర్యంలో నారా చంద్రబాబునాయుడు ఎన్డీఏ కూటమికి మెజార్టీ సీట్లు గెలిచినందుకు విజయవాడ పార్లమెంట్ మెంబర్ కేశినేని శివనాథ్ చిన్ని, నందిగామ ఎంఎల్‌ఎగా తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట నియోజకవర్గం ఎంఎల్‌ఎగా శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మైలవరం ఎంఎల్‌ఎగా వసంత కృష్ణ ప్రసాద్‌లు ఎన్నికైనందుకు గానూ, కంచల గ్రామం నుండి పాదయాత్రగా అంబారుపేట శ్రీ సత్యమ్మ తల్లి గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.